కర్నూలు I నంద్యాల
వార్త
15 సెప్టెంబర్ , 2024 ఆదివారం పేజీలు 4

## రాష్ట్ర మంత్రి టీజీ భరత్ చేతులమీదుగా.. సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు

### - దాతలను అభినందించిన మంత్రి టీజీ భరత్

**కర్నూలు హాస్పిటల్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** ఆపదలో ఉన్నప్పుడు చేయూతనిచ్చేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. విజయవాడ వరదబాధితులను ఆదుకునేందుకు సీఎంఆర్ఎఫ్‌కు మంత్రి టీజీ భరత్ చేతులమీదుగా పలువురు విరాళాలు అందించారు. ది కర్నూలు క్లబ్ తరుపున రూ.5 లక్షలు, ది కర్నూలు యునైటెడ్ క్లబ్ తరుపున రూ.2 లక్షలు, కర్నూలు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ 4వ వార్డు తరుపున వార్డు ఇంచార్జీ ఊట్ల రమేష్ బాబు, బూత్ ఇంచార్జీల ఆధ్వర్యంలో సేకరించిన రూ.60 వేలు, 48వ వార్డులోని 3వ బూత్‌కు చెందిన కెఈ మధులత గౌడ్ రూ.30 వేల విరాళం ఇచ్చారు. దాతలు ఈ చెక్కులను మంత్రి టీజీ భరత్ ఆయన కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈసందర్భంగా దాతలను టీజీ భరత్ అభినందించారు. విపత్కర పరిస్థితుల్లో చిన్న సహాయమైనా ఎంతో ఉపయోగపడుతుందని టీజీ చెప్పారు. ఈకార్యక్రమంలో కర్నూలు క్లబ్ సెక్రెటరీ బాలచంద్రారెడ్డి, జాయింట్ సెక్రెటరీ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ కెఈ శివరామ్ గౌడ్, ఈసి మెంబర్ దుర్గా ప్రసాద్‌రెడ్డి, సలీం బాషా, ప్రసిడెంట్ భీమేశ్వర్‌రెడ్డి, సెక్రెటరీ బలరాం, ట్రెజరర్ సుధాకర్ బాబు, జనరల్ సె క్రెటరీ రాముడు, యేసురత్నం, భూపాల్‌రెడ్డి, సుగుణాకర్ గుప్త, ఊట్ల రమేష్, మన్సూర్ ఆలీఖాన్, కార్తీక్, బూత్ ఇంచార్జీలు తదితరులు పాల్గొన్నారు.



## తుంగభద్ర జలాశయానికి స్థిరంగా.. కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..!

**హాలహర్వి, సెప్టెంబర్14, ప్రభాతవార్త;** కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందించే తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుందని డ్యాం అధికారులు తెలిపారు. కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయానికి భారీ వరదనీరు వస్తుందన్నారు. శనివారం 30,721 క్యూసెక్కుల నీరు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 101.37 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. తుంగభద్ర జలాశయం నుంచి ఆయా దిగువ కాలువలకు 15,204 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు వివరించారు.



## ఉద్యోగమా.. బదిలీనా..!

- క్షణాల్లో పని చేసేస్తాం ... !!
- నేను చెబితే.. ఒకే అయినట్టే ..
- కోడుమూరులో జనం ముంగిట పోటీ పడుతున్న తెలుగుతమ్ముళ్లు

**కోడుమూరు, ప్రభాతవార్త :**



**కోడుమూరు నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీలో ఆదిపత్య రాజకీయాలు రోజు రోజుకి తారా స్థాయికి చేరుతున్నాయి. ఈ నియోజకవర్గంలో రెండు బలమైన గ్రూపు నేతల నడుమన రాజకీయాలు సాగుతున్నా..! ఇక్కడ ఒక వర్గంకు స్థానిక ప్రజాప్రతినిధి తోడొవ్వడంతో ఇక్కడ ప్రభుత్వ పరంగా కానీ, భూసమస్యలు, ఇతరాత్ర పనులకు సంబంధించిన వాటిని పరిష్కరించుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. అందుకే ఆ వర్గంకు చెందిన వారిదే కోడుమూరులో పెత్తనం సాగుతున్న విషయం తెలిసిందే. దీంతో ఆ వర్గంకు చెందిన తెలుగు తమ్ముళ్లు కూడా ఎవరికీ వారు గ్రూపులుగా ఉంటూ వారి పరపతిని చాటుకునేందుకు ఒకరిపై ఒకరు పోటీపడుతున్నారు.**

ఈ గ్రూపులోని ఒకరు ఏకంగా ఉద్యోగాలు ఇప్పిస్తాం.., కోడుమూరులో ఏ .. పని కావాలన్నా., తనను సంప్రదించండి ... వాటిని క్షణాల్లో పని పూర్తి చేస్తామని కాలర్ ఏగేసి చెప్పుతున్నడంతో ఆ చోటా నాయకుని ఆశ్రయించడం శోచనీయం. అంతే గాక తనకు నియోజకవర్గ టీడీపీ నేతతో మంచి దోస్తి ఉందని., ఈ మాటలను బహిరంగ ప్రదేశాల్లో జనాలకు చెప్పుతున్నడంతో ప్రజలు కూడా అలాంటి వారికి దగ్గరవుతున్నారు. వారిని ఆశ్రయించే వారికి ఎలాంటి హామీ ఇస్తున్నారు.., వారి దగ్గర ఎలాంటి సెటిల్ మెంట్ చేసుకుంటున్నారో అనే విషయాలు గోప్యంగా మిగిలి పోతున్నాయి. వీరి పెత్తనాన్ని అధికారుల దగ్గర కూడా చూపించడంతో కోడుమూరులో పని చేసే ఉద్యోగులు జంకే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇలా తెలుగు తమ్ముళ్లు జనంలో నిలదొక్కుకునేందుకు ఎవరికీ వారు వారి పలుకుబడిని జనంలో చూపించేందుకు పోటీ పడుతున్నారన్న విషయం సర్వత్రావ్యక్తం అవుతోంది. ఇది ఇలా ఉండగా కోడుమూరులో తెలుగు తమ్ముళ్ల మధ్య సాగుతున్న కోల్డు వార్ రాజకీయాలల్లో వారి మధ్య నెలకొన్న పొరపచ్చాలకు ఇటీవల కాలంలో ఒకరినొకరు బాహ బాహికి దిగిన సందర్భాలు ఉన్నాయి. ఏది ఏమైన గత ప్రభుత్వ పాలన నుంచి ప్రజలంతా ఒకే తాటిపై ఇక్కడ పసుపు జెండాను ఎగురేస్తే .. ప్రస్తుతం ఆ జెండాకు ప్రాతినిధ్యం వహించాల్సిన తెలుగు తమ్ముళ్ల అంతా ఒక తాటిపై ఉండకుండా ఎవ్వరికీ వారు గ్రూపులు కట్టి సామాన్య ప్రజలను ఇరుకునపడేసే పరిస్థితులను తీసుకురావడం ఎంత వరకు సమంజసమనేదే .. కొసమేరుపు...

## గిరిజనులను అన్నివిధాలుగా ఆదుకుంటాం

### : నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

**పాములపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** చెంచు గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకుంటామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం మండల పరిధిలోని వేంపెంట గ్రామంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకటస్వామి అధ్వర్యంలో ఎంపీ బైరెడ్డి శబరి చెంచు గిరిజనులకు నిత్యావసర సరుకులను పంపిణి చేశారు. ఈసందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెంచుకాలనీ వరదనీటి ముంపునకు గురయిందని పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల కిట్లను అందించి గిరిజనులకు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. చెంచు విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా రావడం లేదని ఎంపీ దృష్టికి తెచ్చారు. అలాగే కాలనీకి సమీపంలోని ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీ తనిఖీ చేశారు. గిరిజనులకు అధికారులు అందుబాటులో ఉండాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కేంద్ర టెలికాం సలహా కమిటీ సభ్యులు కురువ రమేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## వినాయకుని ఆశీస్సులు ఉంటే ఉన్నత స్థానాలు లభిస్తాయి

**కర్నూలు విద్య, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** సకల శుభాలకు అదిదేవుడు వినాయకుడని వినాయకుని దేవుని ఆశీస్సులు ఉంటే ఉన్నత స్థానాలు లభిస్తాయని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో మీసాల సుమలత ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చేది, విఘ్నలు తొలగించేది వినాయకుడేనన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ సకల శుభాలు ఆయురారోగ్యం ప్రజలందరికి ప్రసాదించాలని ప్రజలందరు సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు.





## పంచాయతీ మండల పరిషత్ వ్యాపార సముదాయాలకు గ్రహణం..!

- ఏడు సంవత్సరాల నుండి నిరుపయోగంగా ఎంపిడివో కాంప్లెక్స్ మరియు పంచాయతీ కాంప్లెక్స్
- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అధికారులు
- గత ప్రభుత్వంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చేతుల మీదుగా ఎంపిడివో కాంప్లెక్స్ ప్రారంభం
- ఇప్పటికి భవనాలను తమ ఆధీనంలోకి తీసుకోని అధికారులు
- అధికారుల నిర్లక్ష్యమా లేక రాజకీయ ఒత్తిడా

**ఆలూరు రూరల్, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** ఆలూరు పట్టణంలో ఎంపిడివో కార్యాలయం వద్ద రూ.80లక్షలతో అదే విధంగా సంత మార్కెట్‌లో రూ.1.20కోట్లతో పూర్తి చేసిన కాంప్లెక్స్‌లను ఇటు పంచాయతీ అధికారులు మరియు ఎంపిడివో అధికారులు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు వేలం వేయకుండా కాలయాపన చేస్తున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఆలూరు సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారులు అరుణాదేవి ఆధ్వర్యంలో సిండికేట్‌గా ఏర్పడి ఆలూరు సంతమార్కెట్ కాంప్లెక్స్‌లను వైసీపీ కార్యకర్తలకు 12 కాంప్లెక్స్‌లు మరియు సర్పంచ్ అరుణాదేవి వర్గీయులకు కాంప్లెక్స్‌లను వారు వారు పంచుకోవాలని చూస్తుండగా ప్రభుత్వం మాది అంటూ గతంలో ఉన్నటువంటి ఒక వైసీపీ నాయకుడు అడ్డుకోవడంతో వేలంపాట నిలిచిపోయింది. గతంలో ఇదే విషయం పై సర్పంచ్ అరుణాదేవిని వివరణ అడగ్గా సర్పంచ్‌గా పోటీ చేసే సమయంలో యువకులకు ఉపాధి కల్పిస్తానంటూ ప్రచారం చేసి సర్పంచ్‌గా గెలిచారు. కాని ఆలూరులో చాలా మంది నిరుద్యోగ యువకులు ఉన్నారు. వారికి కాంప్లెక్స్ కేటాయించి ఉపాధి కల్పించాలని కోరగా ఆమె మాట్లాడుతూ మా ప్రభుత్వం లేదు మేమేం చేయలేమంటూ సమాధానం ఇచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు అవుతుంది. గతంలో సర్పంచ్ ఎన్నికల సమయంలో సర్పంచ్ అరుణాదేవి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల విషయంలో అటు సర్పంచ్, ఇటు అధికారులు ఇప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా కక్ష సాధింపులు వదిలేసి వ్యాపారాలు చేసుకునేందుకు నిరుద్యోగ యువకులకు కాంప్లెక్స్‌లు కేటాయించి ఉపాధి కల్పించడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చూడాలని లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని సీపీఐ మండల కార్యదర్శి షాకీర్, కృష్ణ, మైనా తదితరులు తెలిపారు.




## మాతృశాఖలోకి.. సెబ్ విలీనం..!

- గత ప్రభుత్వం సెబ్‌ను ఏర్పాటు చేస్తూ జారీ చేసిన 12 జీవోలు రద్దు..
- సెబ్‌కు గత ప్రభుత్వం కేటాయించిన సిబ్బందిని రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు..
- రాష్ట్ర వ్యాప్తంగా 6273 మంది ఉద్యోగులకు ఉపశమనం..
- ఉద్యోగ సంఘాల నాలుగేళ్ల కృషి ఫలితం.. ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల హర్షం..

**కోసిగి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త** గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను రద్దు చేస్తూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాతృశాఖఎక్సైజ్‌లోకి విలీనం చేసింది.. ఇందుకు సంబందించి గత ప్రభుత్వం సెబ్‌ను ఏర్పాటు చేస్తూ జారీ చేసిన 12 జీవోలను రద్దుచేసి సెబ్‌శాఖకు కేటాయించిన సిబ్బందిని రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6273 మంది సెబ్ ఉద్యోగులకు ఉపశమనం కలుగుతున్నట్లు తెలుస్తోంది..ఈ సెబ్ విలీనంకు సంబందించి రాష్ట్రంలోని సెబ్ ఉద్యోగులు, సిబ్బందిహర్షం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ వారి చిత్ర పటాలకు పాలభిషేకం చేస్తున్నారు..

వైసీపీ ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలపై ఆ శాఖ ఉద్యోగ సంఘాలు నాలుగేళ్లుగా చేసిన కృషికి ఫలితం లభించింది.. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో దీనిని ఆమోదించటంతో పాటు, అధికారిక ఉత్తర్వులు జారీ చేయడంపై ఆ శాఖకు చెందిన సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.. ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు.. ఉద్యోగులనుఎక్సైజ్‌శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది..ఇదే సమయంలో సెబ్ ఏర్పాటు కోసం జారీ చేసిన 12 జీవోలనుసైతం ఉపసంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.. దీంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ గతంలో లానే పూర్తి స్థాయిలోపనిచేయడానికి సిద్దమయింది..

గత వైకాపా ప్రభుత్వంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)గా విభజిస్తూ కొత్త జీవోలుసృష్టించి, తన అనుకూల వ్యక్తులతో మద్యం, ఇసుక వ్యాపార కార్యకలాపాలు చేయిస్తూ వైకాపా ప్రభుత్వం పబ్బం గడుపుకుందనేఆరోపణలు ఉన్నాయి.. 2020 సంవత్సరం మే నెలలో అప్పటి వైకాపా ప్రభుత్వం ఎక్సైజ్‌ను విభజిస్తూ సెబ్‌గా చేసి ఉత్తర్వులు జారీ చేసింది..దీంతో 70 శాతం ఉద్యోగులు సెబ్‌లో ఉండేలా కేవలం 30 శాతం మంది ఉద్యోగులు మాత్రమే ఎక్సైజ్‌లోఉండేలా నిర్ణయం తీసుకున్నారు.. దీనికి తోడు వైకాపా పాలనలో మాఫియాగా ఏర్పడి మద్యం, ఇసుక అక్రమాలపై సెబ్‌కు అధికారాలు జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది..ఎక్సైజ్ శాఖకు ఉన్న అధికారాలలో తీవ్ర కోత విధించింది.. దీనిపై ఎక్సైజ్ శాఖగజిటెడ్ అధికారుల అసోషియేషన్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల అసోసియేషన్, కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్, మినిస్ట్రీయల్ అసోసియేషన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తూ నాలుగు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జేఏసిగా ఏర్పడి అప్పటి మంత్రులకు, ముఖ్యమంత్రికార్యాలయానికి తమ నిరసనలు తెలియజేసారు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 208 స్టేషన్‌లను రెండుగా విభజిస్తూ నిర్ణయం తీసుకున్నారు.. రాష్ట్రంలో ఉన్న 6273 మంది సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామినినెరవేరుస్తూ, ఇటీవల మంత్రి వర్గ సమావేశంలో సెబ్‌ను తిరిగి ఎక్సైజ్‌శాఖలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు.. ఇప్పటి వరకుసెబ్ కింద నిర్వహించిన స్టేషన్లు, ఫర్నిచర్, వాహనాలు, భవనాలు, సిబ్బంది తిరిగి మాతృసంస్థలో విలీనం అయ్యేలా డిజీపీ ఉత్తరు వ్యలు జారీ చేయడం జరిగింది.. దీనిపై సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు..

## కార్యకర్తలకు అండగా నేనున్నా..!

### - ఆలూరు వైసిపి ఎమ్మెల్యే విరుపాక్షి

**హొళగుంద,సెప్టెంబరు 14,ప్రభాతవార్త** వైసిపి కార్యకర్తలకు అండగా నేనున్నానని ఆలూరు వైసిపి ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శనివారం హొళగుందలోని స్థానిక తేరుబజార్‌లో వైసిపి మండల కన్వీనర్ షఫీవుల్లా ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 100రోజులు దాటినా ఏ పథకాలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండ రాష్ట్ర ప్రజలకు నమ్మక ద్రోహం చేశారన్నారు. గత కొద్దిరోజులుగా కొంతమంది వైకాపా నాయకులు పార్టీ మారుతున్నారనే పుకార్లు షికారు చేస్తున్నాయని అయితే పార్టీ మారినంత మాత్రాన ఒరిగేది ఏమీలేదన్నారు. తమ సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారుతున్నారన్నారు. సిఎం చంద్రబాబునాయుడే ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదని మీరు పార్టీ మారితే ప్రయోజనం ఏముందని సూటిగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజులైనా విద్యార్థులు, అక్కచెల్లెమ్మలు,రైతులను పూర్తిగా మోసం చేశారన్నారు.



సూపర్‌సిక్స్ పథకాలు వచ్చే ఏడాది నుండి ప్రారంభమవుతాయని చెప్పి మాట వదిలించుకున్నార న్నారు. దేవాలయంలాంటి అసెంబ్లీలో సూపర్‌సిక్స్ పథకాల గురించి వింటుంటే భయమేస్తుందని సిఎం చంద్రబాబు చెప్పడం సరైంది కాదని ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చేటప్పుడు ఎందుకు ఆలోచించలేదని ఆయన ప్రశ్నించారు. 100రోజులకే ఈ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. 2029ఎన్నికల్లో కచ్చితంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడుతుందని కావున కార్యకర్తలు ఎవ్వరు కూడా అధైర్య పడొద్దని పార్టీని నమ్ముకున్న ప్రతిఒక్కరికి అండగా ఉంటానని మీ సమస్యను నా సమస్యగా భావించి ఎల్లప్పుడు అందుబాటులో ఉండి అండగా ఉంటానన్నారు. ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో శశికళ కృష్ణమోహన్ దంపతులు,మాజీ సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున,వెంకటరెడ్డి, వెంకట రామిరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బావ శేషప్ప, ఎంపిటిసి మల్లికార్జున,సర్పంచ్ తనయుడు పంపాపతి, వైస్ ఎంపిపి భర్త హనుమప్ప, ఎస్‌కె గిరి,కోకన్వీనర్ రవిస్వామి, కృష్ణ, లింగంపల్లి విరుపాక్షిరెడ్డి,రంగస్వామి, అసేన్ అలీ, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆయిల్ ధరలు పెరిగాయా .. వ్యాపారులు పెంచారా

**నంద్యాల,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలో ఈ రోజు ఉదయం నుంచి ఆయిల్ ధరలు రెక్కలు వచ్చినట్లు పెరిగిపోయాయి. దీంతో ప్రజలు బెంబేలు ఎత్తిపోతు ధరలు పెరిగాయా వ్యాపారులు పెంచారా అని చర్చించుకుంటున్నారు. పామాయిల్ ధర గతంలో 95 లు ఉండేది ఇప్పుడు రూ.110, ప్రీడమ్ ఆయిల్ ధర 115 నుంచి ఇప్పుడు 135 వ్యాపారస్తులు విక్రయిస్తున్నారు. హఠాత్తుగా వ్యాపారస్తులు ధరలు పెంచడంపై వినియోగదారులు తీవ్రంగా మండపడుతున్నారు. ఆయిల్ కొనే పరిస్థితులు కనపడడం లేదని దీనిపై సంభంధిత అధికారులు తక్షణమే స్పంధించి పెరిగిన ధరలపై ఆరా తీయాలని వారు కోరుతున్నారు.




## వక్స్‌బోర్డు స్థలంలో భవన నిర్మాణం కూల్చబోయిన.. మున్సిపల్ అదికారులు

: కూలిస్తే ఆత్మహత్య చేసుకుంటామని మిద్దెపై ఎక్కిన యజమాని
: మేము ఆక్రమించుకోలేదు. రూ 1కోటితో కొన్నామన్నా యజమాని బార్య
: మంత్రి హామీ ఇస్తే కిందకు వస్తాం లేకుండా చస్తాం మా డబ్బులు మాకు ఇస్తే కాళీ చేస్తాం



**నంద్యాల, సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి** నంద్యాల పట్టణంలోని బైపాస్ వద్ద ఉన్న శిల్పానగరు వద్ద హైటెక్షన్ నెల కొంది ఓ వ్యక్తి తన వృద్ధతండ్రి, 5సంవత్సరాల చిన్నాకుమారుడితో కలిపి భవనముపైకి ఎక్కి క్రిమిసంహారి మందు చేతపట్టుకుని అత్మహత్య యత్నము చేసుకుంటామని హల్‌చెల్ చేశారు పూర్తి వివరాలలోకి వెళ్లితే నంద్యాల బైపాస్ వద్ద శిల్పానగరు వద్ద వక్స్ బోర్డు స్థలంలో ఇల్లు నిర్మాణము చేశారని వాటిని కూల్చడానికి మున్సుపల్ సిబ్బంది అక్కడకు జేసిపితో చేరుకోవడము జరిగింది. దీనితో వెంటనే అ భనవన యజమాని తన చిన్నకుమారుడు, తండ్రితో కలిసి బవనముపై ఎక్కాడు. మా ఇల్లు కూలిస్తే ఇక్కడి నుండి దూకి చస్తామని బెదిరి ంచాడు. దీనితో ఏమి చెయ్యలేక సిబ్బంది మిన్నకుండి పోయారు. తాను ఈ స్థలము అక్రమించుకోలేదని శ్రీనివాసరెడ్డి వికాస్ అనేఊ వ్యక్తులతో కొన్నామని చెప్పారు. దీని విలువ రూ కోటితో కొన్నామని చెప్పారు. అలాగే ఇంటి నిర్మాణమునకు రూ 50లక్షలు ఖర్చు చేశానని చెప్పారు. గతంలో కూడా ఇలాగే కూల్చడానికి వచ్చారు నాడు కాస్త వెనుక్కు తగ్గాము,. తిరిగి నేడు కూల్చడానికి రావడము ఏమిటి ప్రశ్నించారు.ఇక్కడ రైతు నగరులో ఎన్నో భవనాలు అక్రమంగా నిర్మాణము చేస్తున్నారని వాటి జోలికి ఎవరు పోవడము లేదని వాపోయారు. తాను కొన్న పిదప కమీషనరు, ఇతర అదికారులకు కమీషన్‌లు కూడా ముట్టచెప్పాని చెప్పారు. ఇప్పుడు కూల ్చమని మంత్రి హామీ ఇస్తేనే కిందకు వస్తా



లేదంటే ముగు ్గరము అత్మహత్య చేసుకుంటామని అన్నారు.అలాగే తని సతీమని మాట్లాడుతూ మేము సెంటు రూ 10లక్షలు పెట్టి కొనుగోలు చేశామే కాని ఎవరి వద్ద నుండి దౌర్జన్యముగా లాగుకోలేదని మా డబ్బులు మాకు చెల్లించి దీనిని ఎవరైన తీసుకోవచ్చు కూల్చుకోవచ్చుని అన్నారు. అలాకాకుండా కూల్చడానిక సిద్దం అయితే మేమంతా అత్మహత్యలు చేసుకుంటామని చెప్పారు.



# ఆదోనివాసి శ్రీనాథ్‌గుప్తాకు భారతసేవారత్న జాతీయ అవార్డు..

**- సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుంటున్న శ్రీనాథ్‌గుప్త**
**- ప్రజాసేవలో ఎందరికో ఆదర్శంగా నిలిచిన శ్రీనాథ్‌గుప్త**



**ఆదోనిలీగల్, సెప్టెంబర్14, ప్రభాతవార్త;** పట్టణానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు, ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా), ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) అధ్యక్షులు, లయన్స్ క్లబ్ కార్యదర్శి వంకదారు శ్రీనాథ్‌గుప్తాకు భారతసేవా రత్న జాతీయ అవార్డు దక్కింది. బెంగళూరుకు చెందిన ప్రముఖ సోమలరాజు ఫౌండేషన్‌వారు ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా ఐదు రాష్ట్రాల నుంచి నిస్వార్థ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్న 35 మందికి భారత సేవా రత్న జాతీయ అవార్డును శనివారం బెంగళూరులో ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, ప్రముఖులు, ఫౌండేషన్ నిర్వాహకులు శివరాజు చేతులమీదుగా శ్రీనాథ్‌గుప్త అందుకున్నాడు. సమాజంలో అన్నివర్గాల వయస్సు గల వారికి శ్రేయస్కరమైన పనులు చేయడం ద్వారా ఈ అవార్డు దక్కిందని శ్రీనాథ్‌గుప్త సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు రాకతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. గతంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు, పిల్లలకు దేశభక్తి గురించి, వకృత్వపు, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేయడం జరిగిందన్నారు. ఇండిపెడెన్స్‌డే, గాంధీజయంతి, పొట్టి శ్రీరాములు జయంతి, వివేకానంద జయంతి లాంటి ముఖ్య దినాలను పాటించడంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, బ్రెడ్లు అందించడం, శరణార్థులకు ఉచితంగా దుప్పట్లు పంచడం, పిల్లలకు ఉచిత నోటు బుక్స్, కలరింగ్ కిట్లు పంచడం, వంటి ప్రజా ఉపయోగం ప్రజాహితమైన పనులు చేసినందుకు తనకు అవార్డు రావడం జరిగిందన్నారు. తన సేవలను గుర్తించి అభినందించిన ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# దాడికి గురైన మహిళను పరామర్శించిన ప్రజా,దళిత సంఘాల నాయకులు

**పెద్దకడుబూరు, సెప్టెంబరు 14,ప్రభాతవార్త :** మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో బిసిల చేతిలో దాడికి గురై ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోవిందమ్మను శనివారం ఎమ్మార్పీఎస్, వైసిపి, బిఎస్‌పి, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం తదితర ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. గోవిందమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నేటి సమాజంలో ఇలాంటి దాడి జరగడం హేయమైన చర్య అని ఈ దాడిని ముక్తకంఠంతో తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గోవిందమ్మ కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు అన్ని ప్రజా సంఘాలు,ఆయా రాజకీయ పార్టీల నాయకులను కలుపుకుని ముందుకెళ్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండ కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యువరాజ్, సతీష్, శాంతిరాజు, రోగెన్న, బాబు, వైసిపి నాయకులు ముక్కరన్న, అర్లప్ప, కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రాజు, బిఎస్‌పి పార్టీ నాయకులు లక్ష్మినారాయణ, వివిధ వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద మద్రాసా మదీన తుల్ ఉలూం కమిటి వరద బాధితులకు లక్ష విరాళం

**: కమిటి అధ్యక్షుడు ఎం.ఏ రషీద్ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఏ బుడ్డాకు చెక్కు పంపిణి**
**: మద్రాసా కమిటి సభ్యులకు అభినందనలు తెలిపిన ఎంఎల్‌ఏ బుడ్డా**



**ఆత్మకూరు, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** విజయవాడ ప్రాంతంలో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలకు ఆత్మకూరు పెద్ద మదరాస కమిటి ఆధ్వర్యంలో సహాయం అందించేందుకు ముందుంటామని పెద్దమద్రాసా మదీనా తుల్ ఉలూమ్ కమిటి అధ్యక్షులు ఎం.ఎ రషీద్ అన్నారు. శనివారం వేల్పనూరు గ్రామంలో శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి స్వగృహంలో కమిటి సభ్యులు అందరు కలసి ఎంఎల్‌ఏను గజమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి రూ.1లక్ష రూపాయాల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన పేదప్రజలకు శ్రీశైలం నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రజల నుంచి అందిస్తున్న విరాళాలను సేకరించడం హర్శించదగ్గ విషయమని కొనియడారు. వరద బాధితులకు సహాయం అందించిన మదరాస కమిటి సభ్యులకు ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మద్రాసా కమిటి ఉపాధ్యాక్షులు అబ్దుల్ వహబ్, సెక్రటరి వలి, ట్రెజరర్లు ఎం.టి రహంతుల్లా, మహెబుబ్ బాషా, హెచ్‌ఎం మౌళాన ముర్తుజా, కమిటి సభ్యులు శివపురం నూర్ మహ్మద్, కూరగాయాల మాబు, టీచర్ నూర్‌మహ్మద్, రఫి, నూర్, అస్లాం, సోపిసా, టింబర్ డిపో అలిసాహెబ్, కలిముల్లా, పాల్గొన్నారు.

# రాజీమార్గమే..రాజమార్గం..!

**పత్తికొండ, సెప్టెంబరు 14,ప్రభాతవార్త**

రాజీమార్గమే రాజమార్గం అని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జీతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి ఇరువర్గాల కక్షిదారులను విచారించి 84కేసులను పరిష్కరించినట్లు క్లర్క్ రాఘవేంద్ర తెలిపారు. ఇందులో క్రిమినల్-54, సివిల్-14, ఈపిలు -11, గృహ హింస-3, భరణం-2కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించామన్నారు. పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించడమే లోక్ అదాలత్ ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, లోక్ అదాలత్ న్యాయవాదులు నాగభూషణంరెడ్డి, రమేష్‌బాబు, న్యాయవాదులు ఎల్లారెడ్డి, సురేష్‌కుమార్, సత్యనారాయణ, హుల్తెన్న, ఈరన్న, మల్లికార్జున, సురేంద్ర, కృష్ణయ్య, జటంగిరాజు, రవిప్రకాష్, బాలభాష, నారాయణస్వామి, వెంకటేశ్వర్లు, ప్రసాద్‌బాబు, మధుబాబు, దామోదర ఆచారిఇ, సూరజ్, నబీ, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్, వాసు, భాస్కర్, అరుణ్, హరికృష్ణ, రజాక్ తదితరులున్నారు.

# వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్-2024బిల్లును వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యేకు వినతి

**హొళగుంద, సెప్టెంబరు 14, ప్రభాతవార్త**

వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్-2024బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ శనివారం ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే విరుపాక్షికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం జాతీయ స్థాయిలో ఒక వర్గంపై విద్వేశాన్ని కేంద్రీకరించి 40సవరణలతో మైనార్టీల సహాయ సంపద నిధి ఆల్ ఇండియా వక్ఫ్‌బోర్డులో తీవ్ర మార్పులను చేస్తూ తీసుకురాబోతున్న వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్-2024 బిల్లును యావత్ ముస్లిం, లౌకికవాద సమాజం ఏకతాటిపై వచ్చి విరోధాన్ని వ్యక్తం చేస్తుందన్నారు. ఈ దేశాన్ని పరిపాలించినటువంటి రాజులు, చక్రవర్తుల కాలంనాటి ఆస్తులు, ఆస్థానాలు మరియు చారిత్రాత్మక భవనాలు, కట్టడాలతో పాటు ఖరీదైన స్థలాలు తదితరములతో నేడు స్వాతంత్ర్య భారతదేశంలో 1954లో రాజ్యాంగబద్ధ ట్రిబ్యునల్ చట్టపరసంస్థగా రూపుమారి దేశంలోనే అత్యధిక ఆస్తులు కలిగిన మూడవ అతిపెద్ద సంపన్న సంస్థగా ఆల్ ఇండియా వక్ఫ్‌బోర్డు నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీల మసీదులు, ఈద్గలు, స్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లు, అనాథాశ్రమాలు, వృత్తి శిక్షణ శిబిరాలు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, ముస్లిం విద్యాభివృద్ధి తదితర శ్రేయస్సు కార్యాలు వక్ఫ్ ఆధీనంలో నడుస్తున్నాయని కాగా నేడు జాతీయ స్థాయిలో కోట్ల కొలది విలువ కలిగిన వక్ఫ్ ఆస్తులు అక్రమంగా కబ్జాలకు గురై ప్రైవేటు వ్యక్తుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నప్పటికీ వాటి సంరక్షణకు సారథిగా నిలవాల్సిన ప్రభుత్వమే సదరు చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకుందన్నారు. కావున ఈ ప్రతిష్ట మరియు పటిష్ట ఆల్ ఇండియా వక్ఫ్‌బోర్డు యొక్క ఆవిర్భావాన్ని మరియు అస్తిత్వాన్ని అంతమోదించేలా మతతత్వ బిజెపి ప్రభుత్వం 40కపట సవరణలతో వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్-2024బిల్లు రూపకల్పనకు పూనుకోగా బిల్లుపై అభ్యంతరాలు, అంగీకారాలను నిర్ధారించుటకు భారత పార్లమెంట్ ఆదేశాలతో 31మంది సభ్యుల ద్వారా ఏర్పాటు చేసిన కమిటీలో వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి కూడా ఉన్నందున వైసిపి అధిష్ఠానం తరుపున సదరు పార్లమెంటరీ కమిటీలో సభ్యులుగా ఉన్న విజయసాయిరెడ్డి బిల్లుకు తీవ్ర విరోధాన్ని వ్యక్తపరుస్తూ సదరు బిల్లును సంపూర్ణంగా వ్యతిరేకించాలని కోరారు. ఎమ్మెల్యేకు అందించిన ఈ వినతి మాజీ సిఎం, వైసిపి రాజస్యభ సభ్యులకు పంపించడం జరుగుతుందన్నారు.

# మెగా లోక్‌అదాలత్‌లో 73 కేసులు పరిష్కారం

**- ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి**

**బనగానపల్లె, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** సర్వోన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో భాగంగా బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 73 కేసులు పరిష్కారమైనట్లు ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్ తెలిపారు. ఈ పరిష్కారంలో భాగంగా ఇండియన్ పీనల్ కేసులు 38 మరియు సమ్మరీ ట్రైన్ కేసులు 31గాను రూ.7వేలు జరిమానా అలాగే చెక్‌బౌన్స్ 3 కేసుల్లో రూ.5.34లక్షలు పరిష్కారమైనట్లు తెలిపారు. అలాగే ఒక డీబీసీ కేసుకుగాను రూ.7లక్షలు భరణం చెల్లించేలా పరిష్కారం చేసుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ న్యాయస్థానాలకు శ్రమ లేకుండా ఉన్నత న్యాయస్థానాలు ఏర్పాటు చేసిన లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని సత్వర కాలంలో న్యాయం పొందవచ్చునని పేర్కొన్నారు. అలాగే ఆర్థికంగా మరియు కాలయాపన లేకుండా ఇలాంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ మాధవరావు, లోక్‌అదాలత్ మెంబర్ ఎం.రఘురామిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఖాజా హుస్సేన్, సీనియర్ న్యాయవాది అబ్దుల్ ఖైర్, మాధవరెడ్డి, పరుశురామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, టి.ఆర్.జగన్నాథరెడ్డి, అల్లావుద్దీన్, అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య యాదవ్, రూరల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంజునాథరెడ్డి, కోర్టు సిబ్బంది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయురాలు వరద భాదితులకు పది వేలు విరాళం



**శ్రీశైలంప్రాజెక్టు, సెప్టెంబర్14, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయ నిధికి సుండిపెంట గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కండవల్లి ప్రసన్నలక్ష్మి తన వంతు సహాయంగా రూ.10,000/-ల నగదును తన భర్త అయిన బద్దే నాయక్‌తో కలసి శ్రీశైలం నియేజకవర్గం ఏమ్మెల్య్ బుడ్డాం రాజశేఖర్‌రెడ్డికి విరాళంను అందజేసారు. విజయవాడ వరద బాదితుల సహాయార్థం శ్రీశైలం నియేజకవర్గం ఏమ్మెల్య్ బుడ్డారాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు తన స్పదించి విరాళం అందించడం జరిగిందని తెలిపారు. అపదలో ఉన్న ప్రజలకు అండగానిలిచేందుకు సేవా దృక్పధం కలిగిన శాసన సభ్యులు శ్రీశైలం నియేజకవర్గంకు ఉండడం మన అధృష్టంగా బావించడం జరుగుతుందని పేర్కన్నారు. వరదల్లో సర్వం కోల్పోయి నిరా శ్రయులై అల్లాడుతున్న ప్రజలకు తమ వంతు సహాయార్థం అందజేసి దాతృత్వం చాటుకోవడం జరుగుతుందని చెప్పారు. ఏమ్మెల్య్‌కు ఈ విరాళంను అందజేసి మానవత్వంను చాటకున్నారు.

# రేడియం నూర్ వరద బాధితులకు లక్ష విరాళం

**ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకోవడం మంచి శుభపరిణామం**
**టిడిపి పార్టీలో రాజకీయంలో ముందుకు దూసుకెళ్తున్న రేడియం నూర్**



**ఆత్మకూరు, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** విజయవాడ ప్రాంతంలో భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన ప్రజలకు శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ఆర్థిక సహయం అందించడంలో ముందుకు వెళ్తున్న తరుణంలో నా వంతు సహయ సహకరాలు అందిస్తానని మైనార్టీ సీనియర్ టిడిపి యువ నాయకుడు రేడియం నూర్ అన్నారు. శనివారం వేల్పనూరు గ్రామంలో ఎంఎల్‌ఏ స్వగృహంలో రూ.1,00,116లక్ష చెక్కును ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రేడియం నూర్ మాట్లాడుతూ వరద బాధితుల కోసం అన్ని విదాలుగా తక్షణ సహయం అందిస్తున్న శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వరదలో చిక్కుకొని ఎంతో మంది ప్రజలు రోడ్డున పడి దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు విరళాలు అందించాలని ఎంఎల్‌ఏ చెప్పిన మాట కోసం నా వంతు వరద బాదితులకు లక్ష విరాళం అందించడం జరిగిందన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో వరద బాధితుల కోసం నియోజకవర్గ ప్రజలు అందిస్తున్న విరాళాలను త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందించే విదంగా టిడిపి పార్టీ పని చేస్తుందని ఎంఎల్‌ఏ కార్యకర్తలకు, నాయకులకు భరోసా కల్పించారు. వరద బాధితులకు లక్ష విరాళం అందించిన మైనార్టీ నాయకుడు రేడియం నూర్‌కు ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలంప్రాజెక్టు, సెప్టెంబర్14, ప్రభాతవార్త**

శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)శనివారంనాడు శ్రీ నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమి, విజయవవాడ వారిచే కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నినాయకకౌత్వం, శివకైవారం, అయిగిరినందిని, త్రిపుర సంహారం, శివహోం, హరహర శంకరా, తదితర గీతాలకు అష్టకాలు మొదలైన వాటికి జి.నాగతన్విశ్రీ, యుక్తశంకరి, శ్రీజయహారిక, కె.సుదీక్ష తదితరులు నృత్య ప్రదర్శన చేసారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాదన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

# ఎల్లార్తి షేక్షావలి,షాషావలి దర్గాలను దర్శించుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి



**హొళగుంద, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో వెలసిన శ్రీ షేక్షావలి, షాషావలి తాతలను శనివారం ఎమ్మెల్యే విరుపాక్షి దర్శించుకున్నారు. దర్గా నిర్వాహకులు ఎమ్మెల్యే విరుపాక్షికి స్వాగతం పలికి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అలాగే ఈ నెల ఆఖరులో జరిగే ఎల్లార్తి ఉరుసు ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే విరుపాక్షి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే మనందరం బాగుంటామన్నారు. అందరు కలిసికట్టుగా అన్నదమ్ముల వలె ఉండాలన్నారు. అలాగే ఈ నెల 29న జరిగే ఉరుసు ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు దర్గప్ప, ఎస్‌కె గిరి, రాజ, ఈరన్న, షేక్షావలి, శంకర్, సర్దార్, మొహమ్మద్, దాదావలి పాల్గొన్నారు.

# ఘనంగా హిందీ దివాస్ వేడుకలు



**ఆదోనిలీగల్, సెప్టెంబర్14, ప్రభాతవార్త;** ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హిందీ దివాస్, హిందీ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ వి.సజన్న అధ్యక్షతన చేపట్టారు. హిందీ భాష పుట్టుక, హిందీభాష వల్ల ప్రయోజనాలు, హిందీ విద్యార్థులకు తెలియజేశారు. హిందీ సబ్జెక్టుపై పట్టు సాధించిన విద్యార్థులు దేశంలో ఎక్కడైనా బతక గలరని చెప్పారు. దేశంలో ఎక్కువగా మాట్లాడే భాషలో హిందీ ఒకటని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు హిందీలో 100కి 99 మార్కులు సాధించిన వారికి బహుమతులను అందించారు. అలాగే కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు, గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులు ఎం.గోవిందరాజులు, జి.బి.వేదావతి, చిట్టి ప్రసాద్, హిందీ అధ్యాపకులు శ్రీనివాసులు, రాజేశ్వరి, కాంతమ్మ, ప్రభావతి, బాబు, సూరిబాబు, రంగన్న, ఈరన్న, శివయ్య తదితర అధ్యాపకులు, కీర్తి, మహమ్మద్‌బాషా, సాదిక్‌బాషా, ఆఫీసు సబ్బంది పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం.... ; జడ్జి పి.జె.సుధ

**- లోక్‌అదాలత్‌లో 199 కేసుల పరిష్కారం**



**ఆదోనిలీగల్, సెప్టెంబర్14, ప్రభాతవార్త;** రాజీ మార్గమే రాజమార్గమని, ఇరువురు రాజీ అయితే ఓడినట్లు కాదని, ఇరువురూ గెలిచినట్లు అని జడ్జి పి.జె.సుధ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక రెండో జిల్లా అదనపు కోర్టులో మెగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ కాబడిన కక్షిదారులతో జడ్జి మాట్లాడారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేసుకోకుండా రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఇందులో మొత్తం 199 కేసుల లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైనట్లు చెప్పారు. రెండో అదనపు జిల్లా కోర్టు పరిధిలో 35, సీనియర్ సవిడ్ జడ్జి కోర్టులో 07, ప్రిన్సిపల్ సివిల్ కోర్టులో 08, మొదటి అదనపు జూనియర్ కోర్టులో 32, రెండో అదనపు జూనియర్ కోర్టులో 17 కేసులు, పీఎల్‌సీ 08, ఎస్టీసీ అడ్మిషన్స్ 83, సీసీ అడ్మిషన్స్ 09 మొత్తం 199 కేసులు రాజీమార్గం ద్వారా లోక్‌అదాలత్‌లో పరిష్కారమైనట్లు చెప్పారు. అలాగే మోటార ప్రమాదాల కేసుల్లో 21 కేసులు పరిష్కరించబడ్డాయన్నారు. ఇందులో మొత్తం రూ.1.45 లక్షలు శ్రీరామ్, రాయల్ సుందరం, చోళ మండలం, మాగ్మా హెచ్‌డీఐ, టాటా ఏఐజీ, బజాజ్ అలియన్స్, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు, సుంరం జనర్‌కు చెందిన ఒక కేసులో బీమా కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ జీవిత బీమా మేనేజర్ గోపీ కుటుంబ సభ్యులకు రూ.85 లక్షలు ప్రదానం చేశార్నారు. సి.గిరిధర్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఇతర న్యాయవాది, యూనియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు అధికారులు, ఇతర న్యావాదులు లోక్‌అదాలత్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి అర్చన, మొదటి అదనపు సివిల్ జడ్జి లీలాసాయి సుభాష్, కక్షిదారులు పాల్గొన్నారు.

# పంటనమోదు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం

**పత్తికొండ, సెప్టెంబరు 14, ప్రభాతవార్త**

పంటనమోదు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పంటపొలాల్లో ఏ పంటవేశారో చూసుకునే భాద్యత వ్యవసాయ అధికారులకు ఉందని అయితే పంటపొలాలను చూడకుండ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్యాలయంలో కూర్చొని పంటనమోదు చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. పత్తికొండ డివిజనల్ అధికారి ఏడి ఎక్కడుంటాడో అర్థం కాని పరిస్థితి నెలకొందని గ్రామాల శివారులో ఉన్న భూములు తప్ప దాదాపు 5కి.మీల దూరంలో ఉన్న భూములను పరిశీలించడం లేదన్నారు. పంటనమోదు సరిగా చేయకపోవడంతో నిజమైన లబ్దిదారులు నష్టపోవడం జరుగుతుందని కావున పత్తికొండ డివిజన్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

# చలో కల్లుకుంటకు దళిత సంఘాలు పిలుపు

**పెద్దకడుబూరు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త**

దళిత మహిళను బిసి కులాలు విద్యుత్ స్థంబానికి కట్టేసి ఘోరంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ దళిత సంఘాలు ఆదివారం చలో కల్లుకుంటకు పిలుపునిచ్చాయి. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్నట్లు వివిధ దళిత సంఘాల నాయకులు తెలిపారు. శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు కల్లుకుంట గ్రామాన్ని సందర్శించి దాడికి గురైన గోవిందమ్మ ఇంటిని పరిశీలించి అక్కడ కాలనీవాసులతో దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దళిత యువకుడు బిసి అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుంటే నేరమా..లేక దేశద్రోహమా..అని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రశ్నించారు. కొడుకు ప్రేమించిన పాపానికి అతని తల్లిని అతిఘోరంగా దాడి చేయడం సభ్యసమాజం తల దించుకుంటుందని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు విమర్శించారు. దాడికి పాల్పడిన మానవ మృగాలను తక్షణమే అరెస్టు చేసి జీవిత కారాగార శిక్ష విధించాలని వారు డిమాండ్ చేశారు.

# ఆత్మకూరు రేషన్ డీలరు అసోసియేషన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు లక్ష విరాళం

**: రేషన్ డీలరులకు అభినందనలు తెలిపిన ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి**



**ఆత్మకూరు, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** విజయవాడలో వరదలో నష్టపోయిన ప్రజలకు సహాయం అందించేందుకు శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ఇచ్చిన ఫిలుపు మేరకు ఆత్మకూరు రేషన్ డీలరుల అసోసియేషన్ అధ్యక్షుడు వి.వరప్రసాద్‌రావు, ఉపాధ్యాక్షులు ఎస్తేరయ్య, ట్రెజరర్ మంగులూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి రూ.1లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలరు అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ వరదలో ఎన్నో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆర్థిక సహాయం అందించడంలో అసోసియేషన్ ముందుంటుందని వివరించారు. శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి రేషన్ డీలరులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిద గ్రామీణ ప్రాంతాల రేషన్ డీలరులు తదితరులు పాల్గొన్నారు.

# గోసంరక్షణ నిధికి దాత లక్ష విరాళం

**శ్రీశైలంప్రాజెక్టు, సెప్టెంబర్, 14, ప్రభాతవార్త**



శ్రీశైలదేవస్థానం ఆద్వార్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ పథకానికి విరాళంగా హైదరబాద్ వాస్తవ్యులు దామినేని శ్రీహర్ష కుటుంబ సభ్యులతో కలసి గో సంరక్షన నిధికి శనివారంనాడు రూ.1,11,111/-లను విరాళంగా సహాయ కార్యనిర్వహణాదికారి ఐ.ఎన్.వి.మోహన్‌కు విరాళమును అందజేసారు. కాగా విరాళం అందజేసిన దాతను దేవస్థానం తరుపున శేషవస్త్రాలతో సత్కరించి విరాళపు రశీదు, దృవపత్రం, లడ్డూ ప్రసాదాలను అందజేసారు.

# వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యేకు విరాళం అందించిన పెద్దదేవులాపురం గ్రామస్థులు



**వెలుగోడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** బండిఆత్మకూరు మండల పెద్దదేవులాపురం గ్రామ సీనియర్ టిడిపి నాయకులు వరదబాధితుల సహాయార్థం శనివారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి రూ.1,00,050లను ఇవ్వడం జరిగింది. ఇందులో కృష్ణానాయక్ రూ.25 వేలు, మిగతా వారందరు కలిసి రూ.75,050లు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి అందించడం జరిగింది. ఈసహాయం అందించిన వారిలో నాయకులు శివప్రసాద్, భాస్కర్‌రెడ్డి, రామరావు, మిలిటరీ బాష, రంగస్వామి మరియు గ్రామ ప్రజలు అందరి సహాకారంతో పార్టీలకతీతంగా తమవంతు సహాయంగా ఇవ్వడం జరిగింది. ఈకార్య క్రమంలో టిడిపి నాయకులు కృష్ణానాయక్, శివప్రసాద్, మాబాష, భాస్కర్‌రెడ్డి, టీచర్ రామరావు, సుగాలి నారాయణ నాయక్, తత్తూరు రంగస్వామి, తెలుగు మెంటల్ పుల్లయ్య, పెద్దినేని వెంకటేష్, చిట్టన్న, గోపాల్, చెన్నయ్య లు ఉన్నారు. అదేవిధంగా బండిఆత్మకూరు గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు రూ.82, వేలు, మరియు బైరెడ్డి సుబ్బారెడ్డి రూ.30 వేలు, మొత్తం రూ.1,12,000లు ఎమ్మెల్యే స్వగృహంలో అందించారు.

# కుట్రపూరిత సవరణను వెంటనే ఆపాలి

**హొళగుంద, సెప్టెంబరు 14, ప్రభాతవార్త**

వక్ఫ్‌బోర్డు చట్టంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరిత సవరణను వెంటనే ఆపాలని హొళగుంద ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు అన్నారు. శనివారం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ తరుపున ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు జామియా మసీదు పండితులు మౌలానా హబీబుల్లా జామయి మాట్లాడుతూ ఇస్లాం పరిభాషలో వక్ఫ్ అంటే ఒక ముస్లిం వ్యక్తి దైవ భక్తి మరియు ప్రేమతో ఇస్లాం ధర్మం మరియు ముస్లింల అభ్యున్నతికై, తన స్వంతానికి చెందిన ధనాన్ని, వస్తువులను లేదా ఆస్తిని నిరాపేక్షంగా ధర్మమార్గంలో అప్పజెప్పడాన్ని వక్ఫ్ అంటారన్నారు. ఒకసారి వ్యక్తి లేదా సంస్థ ఇస్లాం ధర్మమార్గంలో తమకు చెందినదానిని దానపు ఉద్దేశ్యంతో వక్ఫ్(శాశ్వతదానం) చేస్తే సదరు ఖరీదు లేదా ఆస్తులపై సంపూర్ణ శాశ్వత యాజమాన్య అధికారం వక్ఫ్‌బోర్డుకు చెంది తీరుతుందన్నారు. అంతేకాకుండ భారత రాజ్యాంగం ప్రకారం సదరు వక్ఫ్ సంపదలకు సంబంధించిన పరిపాలన పర్యవేక్షణ విషయంలో ఆల్ ఇండియా వక్ఫ్‌బోర్డుకు సంపూర్ణంగా హక్కు భాద్యతలున్నాయన్నారు. కాగా ప్రభుత్వాలు కూడా భారతీయ నాగరిక సంపద పరిరక్షణకు పాటుపడాలే తప్ప వాటిని నిర్వీర్యం చేసే మార్గాలను ఉత్పన్నం చేయకూడదన్నారు. అనంతరం హాఫీజ్ శమీవుల్లా, హాఫీజ్ కబీర్ నయిమిలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ పేరిట హొళగుందలోని అన్ని మసీదుల మౌల్వీలు, ముతవల్లీలు, ముస్లిం మైనార్టీ పెద్దలు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

# 16నుంచి ఉరుసు ఉత్సవాలు

**పత్తికొండ, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** పట్టణంలో వెలసిన గురుదేవులు హాజరత్ సయ్యద్ షామొహమ్మద్ పీర్ మొహియుద్దీన్ స్వాముల వారి ఉరుసు ఉత్సవాలు ఈ నెల 16వ తేదీ నుండి ప్రారంభం అవుతాయని దర్గా నిర్వాహకులు శనివారం తెలిపారు. 16న గంధం, 17న ఉరుసు మహోత్సవం, 18న జియారత్ ఫాతేహాలు ఉంటాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఉరుసు రోజున సాయంత్రం 6గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పెద్దఎత్తున ఉరుసు కార్యక్రమంలో పాల్గొనాలని హుస్సేన్ ఆలం కమిటీ వారు కోరారు.

# వెల్దుర్తిలో ఘనంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలు



**వెల్దుర్తి, సెప్టెంబర్14, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని శ్రీ సత్యసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం (హిందీ దివస్)హిందీ భాషా దినోత్సవ వేడుకలు కరస్పాండెంట్ రమణయాదవ్, హెచ్‌ఎం గఫూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ1953వ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్14న కేంద్రప్రభుత్వం హిందీని అధికార భాషగా ప్రకటించారు. అప్పటినుంచి మనం ఈ వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచంలో అత్యధికంగా ప్రజలు మాట్లాడే భాషల్లో హిందీ నాల్గవ స్థానంలో ఉందన్నారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులకు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు హిందీపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.వి.రమణయాదవ్, హెచ్‌ఎం గఫూర్, డైరెక్టర్ తిప్పారెడ్డి, ఉపాధ్యాయులు నూర్‌బాష, రఘు, పరశురాం, మద్దిలేటి, సాయి, రాజ్యలక్ష్మీ, రేవతి, లక్ష్మీ, జయలక్ష్మీ, శివలక్ష్మీ, షాహిన్, రేష్మ, ఫర్‌హా, సుజాత, భార్గవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి -సిపిఎం



**వెల్దుర్తి, సెప్టెంబర్14, ప్రభాతవార్త :** విప్లవవీరుడు సీతారాం ఏచూరి సేవలు మరువలేనివని సిపిఎం జిల్లాకార్యదర్శి నగేష్ అన్నారు. స్థానిక లారీ మోటర్‌వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో శనివారం కామ్రేడ్ సీతారాంఏచూరి చిత్రపటానికి ఆయన మండల నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 దశాబ్దాలపాటు మొక్కవోని దీక్షతో ఎర్రబాటలో అగ్రభాగాన నిలిచిన యోధుడు సీతారాం ఏచూరి అన్నారు. ప్రజాస్వామ్యం, సెక్యూలరిజం పరిరక్షణకు జరిగిన పోరాటాలు ఉద్యమాల్లో ఏచూరి పాత్ర అద్వితీయమైనదన్నారు. 12 సంవత్సరాలు రాజ్యసభ సభ్యునిగా ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు ఏచూరి అందుకున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు రాజు, సిపిఎం మండల నాయకులు మారెన్న, బజారి హమాలీ యూనియన్ నాయకులు మల్లి, సత్యం, చిన్నయేసు, బ్రహ్మం, కిటుట, రాముడు, శీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరులో.. రెడ్‌బుక్ రాజ్యాంగం

**- తేదేపా పార్టీకి వెన్నుపాటు పొడిచింది మీరు కాదా**
**- మానాయకున్ని విమర్శించే అర్హత మీకు లేదు**



**నందవరం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** 2021 సంవత్సరం స్థానిక ఎన్నికల్లో హాలహర్వి గ్రామంలో ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్‌రెడ్డికి వ్యతిరేకంగా రైస్‌మిల్ నారాయణరెడ్డి పోటీ బరిలోకి దిగి తెలుగుదేశం పార్టీకి వెన్నుపోటు పొడిచింది మీరు కాదా అని ద్వితీయశ్రేణి నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు మాదిగ శాంతిరాజు వరదరాజులు మండిపడ్డారు. శనివారం మండల కేంద్రమైన పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో మా ఎమ్మెల్యేని విమర్శంచే అర్హత ఆయన లేదని వారు మాట్లాడడం చాల విడ్డూరంగా ఉందన్నారు. నారా లోకేష్ చెప్పిన విధంగా ఎమ్మిగనూరులో రెడ్‌బుక్ రాజ్యాంగం కొందరు టిడిపి నాయకులు అమలు చేస్తున్నారన్నారు. సమాజంలో ఏవిధంగానైనా తిరగవచ్చు ఏవరినైనా ముచోచ్చు అన్న చందంగా హాలహర్విలో మాజీ మండలాధ్యక్షుడు తనయుడు గతంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరణిస్తే వారికి ఇచ్చిన ఇంటి పట్టాను కూడ వేరోకరికి అమ్ముకున్న ఘనత వారిది కాదా అన్నారు. అలా తెలుగుదేశం పార్టీ అని చెప్పుకుంటూ పార్టీకి గొతులు తవ్వేరకం ఆ నాయకునిది. అలాంటి వారు మా వైయస్ఆర్ పార్టీలో ఉన్నటువంటి నాయకులను విమర్శించే అర్హత వారికి ఉందా లేదా అని వారి మనస్సాక్షికి వారే చెప్పుకోవాలన్నారు. మా నాయకుడు ఇప్పటి వరకు ఎన్నికల్లో నిలవకపోయినా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గ్రామంలో ఒక్కడే సర్పంచ్‌ను గెలిపించుకున్న మాట మరిచిపోయావా అన్నారు. మరికొందరు గురురాఘవేంద్ర ప్రాజెక్టు అంటే బివి అని బివి అంటే గురురాఘవేంద్ర ప్రాజెక్టు అని అంటున్నారు. అప్పటి మంత్రి స్వర్గీయ బివి మోహన్‌రెడ్డి గురురాఘవేంద్ర ప్రాజెక్టు శంఖుస్థాపన మాత్రమే చేశారని 2004 అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పూర్తి నిధులు సాధించి 10 సంవత్సరాల్లో ప్రాజెక్టు పనులు పూర్తిచేశారని మీరు గుర్తుచేసుకోవాల్సిన విషయం ఎంతైనా ఉందన్నారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు నుండి పులిచింత చెరువుకు టిడిపి ప్రభుత్వ హయాంలో ఒపెన్ కాల్వ ద్వారా నీటిని సరఫరా చేశామని కాల్వ నీటిని రైతులు మోటార్ల ద్వారా పొలాలకు నీటిని వినియోగించుకున్నారని వారన్నారు. వైసీపీ హయాంలో కూడ అదేవిధంగా రైతులు నీటిని పులిచింత చెరువు అందించామని రైతుల పొలాలకు మీకంటే ఎక్కువ నీటిని అందించిన విషయాన్ని అధికారులు ధృవీకరించి ఇచ్చిన లెక్కులు చూపించామన్నారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు మోటార్లను అడ్డం పెట్టుకొని అడ్డదారిలో రైతుల వద్ద ఎకరాకు రూ.3 వేలు దండుకుంటున్న ఘనత టిడిపి నాయకులదేనని నిప్పులు చెరిగారు. ఏ పార్టీలోనైనా ఏ నాయకుడైనా మాట్లాడే అర్హత. స్వేచ్ఛా హక్కు ఉందన్నారు. ఎమ్మిగనూరు నాయకత్వంలో మాత్రం అంబలి తాగేవారు ఒకరైతే వారి మీసాలను ఎగబెట్టేవారు ఇంకోరు అయినట్టుగా టిడిపిలో అధికారం చేయించేది ఒకరైతే అనవసర విషయాలపై చర్చలు జరిపేది ఇంకోరు అన్నట్టుగా ఉంది. ముందు మీ పార్టీలో సీనియర్ నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారో మీరు తెలుసుకోవాలన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీలో ఉన్న మీరు గురురాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా నీరు అందించే చర్యల్లో మీరు విలీనం కావాలన్నారు. ఈకార్యక్రమంలో నందవరం నాయకులు మాచాపురం నాయకులు కోటేశ్వర్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, సప్పోగుదానం, హాలహర్వి నాయకులు ఆనంద్, ప్రకాశం, జయరాజు, తలారి తిక్కయ్య, దుబ్బా, నల్లప్ప, కె రంగన్న, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆంధ్ర తిలక్ హరి సర్వోత్తమరావు జయంతి వేడుకలు



**వెలుగోడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** ఆంధ్ర తిలక్ గాడిచెర్ల హరి సర్వోత్తమరవు 141వ జయంతి వేడుకలను శనివారం స్థానిక గ్రంధాలయంలో గ్రంధాలయ అధికారి సుమలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ డా.ఎంఎఫ్ ఇమ్మానియేల్, సీనియర్ టిడిపి నాయకులు అమీర్ హంజ, సీనియర్ పాత్రికేయులు రఘురాం యాదవ్, సుల్తాన్, మహిద్దిన్‌లు పాల్గొని గాడిచెర్ల సర్వోత్తమరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1927 ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో రాయలసీమ నంద్యాల నుండి మొట్టమొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్నారు. 1930లో గ్రంధాలయ ఉద్యమాన్ని ఆయన ప్రారంభించారని 1934 సంవత్సరం నుండి గ్రంధాలయ సంస్థల జీవితకాల అధ్యక్షులుగా కొనసాగారన్నారు. వయోజన విద్యకోసం నిరంతర కృషిచేసిన వయోజన పితామహగా పేరుపొందారన్నారు. అదేవిధంగా దేశ స్వాతంత్ర్యం కోసం ఆంధ్ర తిలక్‌గా ప్రసిద్ది చెందారన్నారు. దేశంలోని వారందరికి విద్యను అందించి వారిని అభివృద్ధి పరచాలన్నదే ఆయన ఉద్దేశమన్నారు. గ్రంధాలయాల ఏర్పాటు కోసం నిరంతర కృషిచేసి గ్రంధాలయ ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. మేధావి అయిన హరి సర్వోత్తమరావు స్వరాజ్ స్వతంత్ర పత్రిక నడపడంతో పాటు గొప్ప సంపాదకుడిగా పేరుపొందారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారు ఆయనను జైల్లో పెట్టిన సమయంలో అనేక రచనలు రచించారన్నారు. స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర రాష్ట్రం నుండి మొట్టమొదటి రాజకీయ ఖైదీగా జైలుశిక్ష అనుభవించారన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుతో పాటు, ప్రత్యేక సమైక్యాంధ్ర కూడ ఆయన కాలంలోనే ఏర్పడ్డాయన్నారు. ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను ఆదర్శంగా నేటి విద్యార్థులు యువత ముందుకెళ్లాలన్నారు. ఈజయంతి వేడుకల్లో పాత్రికేయులు రాము, సాబిర్, పాఠకులు బి శంకరయ్య, సయ్యద్ ముజిర్, లాలం శంకరయ్య, శివుడు, లిటిల్ ఏంజెల్ స్కూల్ ఉపాధ్యాయుడు నూరుల్ అమీన్, విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడి జయంతి



**పాములపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** పాములపాడుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచెర్ల హరి సర్వోత్తమరావు 141వ జయంతి ప్రజా సంఘాల నాయకులు శనివారం జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సమాజ సేవకులు నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు స్వాములు, మాల మహానాడు నాయకులు అంకన్న, సిపిఎం నాయకులు స్వామన్న, జనసేన నాయకులు సాయికృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు షెక్షావలి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు స్వాతంత్ర్య సమరయోధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ గాడిచెర్ల హరి సర్వోత్తమరావు స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంసంస్కర్తగా, రచయితగా, గ్రంధాలయాల ఉద్యమకారుడిగా పనిచేశారని తెలిపారు. అప్పటి సమయంలో ప్రధానమంత్రి జవహార్‌లాల్ నెహ్రు, ఇందిరా గాంధీలు పాములపాడుకు వచ్చేవారని పేర్కొన్నారు. హరిసర్వోత్తమరావు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

# ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏఓ



**మాలపల్లి(మంత్రాలయం), సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాలపల్లి గ్రామంలో ఉన్న ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారిజీరా గణేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువుల స్టాకును పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల డీలర్లు రైతులకు ఎంఆర్‌పి ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. ఎరువులు విక్రయించిన అనంతరం రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలన్నారు. ఎరువులు కాని, క్రిమి సంహారక మందులు కాని అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదన్నారు. వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఏపిటిఎఫ్ వేడుకల్లో ఏపి పిఈటి,స్ జిల్లా కార్యదర్శి చందునాయక్



**తుగ్గలి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** కర్నూలు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయని ఏపి పిఈటీ,స్,ఎస్ఏ పిఈ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, తుగ్గలి హైస్కూల్ పిఈటి చందునాయక్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలు పాల్గొన్నారని తెలిపారు. జిల్లా పరిషత్ నందు విద్య, వైజ్ఞానిక మహాసభలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి పిఈటి,స్ అండర్ ఎస్ఏపిఈ అసోసియేషన్ జిల్లా నాయకులు జోసెఫ్ లక్ష్మయ్య, ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు హృదయరాజు, నంద్యాల జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శివ, ఏపిటీఎఫ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉంది

**- సామాజిక వేత్త బి శ్రీనివాస్**




**ఆదోని అర్బన్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** బెంగళూరులో భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవా పురస్కారం అందుకోవడం చాలా గర్వంగా ఉందని అవార్డు గ్రహీత, సామాజిక వేత్త బి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆదోని పట్టణానికి చెందిన బి శ్రీనివాస్ బెంగళూరులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హాల్‌లో జరిగిన సోమలరాజు అంతర్జాతీయ సొసైటీ సంస్థ వారు దేశవ్యాప్తంగా కర్ణాటక, తమిళనాడు, ఏపి, తెలంగాణ, కేరళ ఆయా రాష్ట్రాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని ఎంపిక చేసి వారిని బెంగళూరు మరియు కర్ణాటక ప్రముఖుల చేత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయసేవ పురస్కారం ఇవ్వడం జరిగింది. ఈ ఎంపికలో ఆదోని పట్టణ వాసి బి శ్రీనివాస్‌ను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ సేవ పురస్కారంతో ఘనంగా సత్కరించి, శాలువా కప్పి మొమెంటోతో పాటు ప్రశంసపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా బి శ్రీనివాస్ మాట్లాడుతూ సోమలరాజు అంతర్జాతీయ సొసైటీ సంస్థ వారి ఈ సన్మాన పురస్కారం అవార్డు కార్యక్రమం మరువలేనిదన్నారు. అలాగే సోమలరాజు అంతర్జాతీయ సొసైటీ సంస్థ దేశవ్యాప్తంగా మరియు అన్ని రాష్ట్రాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ 12వ వార్షికోత్సవం దిగ్విజయంగా జరుపుకుని 13వ వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న సామాజికవేత్తలను ఎంచుకుని సన్మానం చేయడం చాలా మంచి విషయమన్నారు. అయితే నేను కూడా జాతీయ సేవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని 2018నుండి సుమారు ఆరు, ఏడు సంవత్సరాలుగా ఏపి పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడి నుండి రాష్ట్ర మీడియా ప్రచార కార్యదర్శిగా పనిచేస్తూ ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నాయా లేదా అనేదానిపై పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకు అలాగే జిల్లా నుండి సామాజిక సేవలు చేస్తున్నందుకు నన్ను ఎంపిక చేసిన సోమలరాజు అంతర్జాతీయ సొసైటీ సంస్థ నిర్వాహకులు రాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సేవా పురస్కారం తనపై మరింత భాద్యతను పెంచిందన్నారు.

# విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కారం చేయాలి



**ఆదోని, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కారం చేయాలని ఎస్‌టియు ఎస్‌టియు పూర్వపు ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న, జిల్లా అధ్యక్షుడు గోకారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, వెంకటేశ్వర్లు, నాగరాజు, సుంకన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎస్‌టియు ముఖ్య నాయకుల ప్రాంతీయ సమావేశం మున్సిపల్ హైస్కూల్ నందు జిల్లా అధ్యక్షులు గోకారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, విడుదల చేసిన జీఓల వలన ప్రభుత్వ విద్యారంగం ముఖ్యంగా ప్రాథమిక విద్య, నిర్వీర్యం అయ్యే పరిస్థితికి చేరుకుందన్నారు. సత్వరం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలలో విలీనం చేసి 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి మరణం బాధాకరం

**మంత్రాలయం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం బాధాకరమని సిపిఎం మండల నాయకులు జయరాజు అన్నారు. శనివారం మంత్రాలయంలో సిపిఎం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. సీతారాం ఏచూరిని కోల్పోవడం పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు లక్ష్మణ్ణ, ప్రాణేష్, రాజన్న, దానియేలు, వీరేష్ మహిళా నాయకురాలు

# ఎస్‌టియు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**ఆదోని అర్బన్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త**

ఆదోని డివిజన్ ఎస్‌టియు ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ బి మహదేవప్ప అధ్యక్షతన జరిగింది. నియోజకవర్గ శాసనసభ్యులు పార్థసారథి, ఎస్‌టియు నాయకులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఎస్ వెంకోబ, ఎం నరసింహారెడ్డి, వెంకటసుబ్బయ్య, టి యల్లప్ప, ఎన్ రాజా, సతీష్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఉపాధ్యాయులు చేసిన సేవలను కొనియాడారు. వారు ఇంకా మరింత సేవలు అందించి మరెన్నో అవార్డులు అందుకోవాలని కోరారు. తదనంతరం ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న, జిల్లా అధ్యక్షుడు గోకారిలు చేసిన సేవలకు తగిన గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు నాగరాజు, వెంకటేశ్వర్లు, నాగరాజు, సుంకన్న, వీరచంద్ర యాదవ్, రమేష్‌నాయుడు, ఎంసి సుంకన్న, శ్రీనివాసులు, హెచ్‌ఎం వెంకటస్వామి, మల్లికార్జున, రామాంజనేయులు, ఆదోని పట్టణ, మండల, ఆస్పరి, కౌతాళం ఎస్‌టియు నాయకులు పాల్గొన్నారు.

# రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదోని జోనల్ స్థాయి ఇండోర్ ఆటల పోటీలు



**ఆదోని, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** విద్యార్థిని, విద్యార్థుల్లో దాగిన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఏడాది రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదోని జోనల్‌స్థాయి ఇండోర్, ఔట్‌డోర్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా నేడు ఆదివారం మల్లికార్జున విద్యాలయం హైస్కూల్‌లో ఇండోర్ గేమ్స్ నిర్వహించడం జరుగుతుందని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్‌రెడ్డి, డాక్టర్ సైఫుల్లాలు తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 15న ఆదివారం ఇండోర్ గేమ్స్‌ను మల్లికార్జున విద్యాలయ హైస్కూల్‌లో, ఈ నెల 22న ఔట్‌డోర్ గేమ్స్‌ను ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో 50పాఠశాలల నుండి 6వ తరగతి నుండి 10వ తరగతి చదివే 3వేల మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొననున్నారని తెలిపారు. ఇండోర్ ఆటల పోటీల్లో చెస్, రూబిక్‌క్యూబ్, డ్రాయింగ్, ఎలిక్యూషన్, క్విజ్, ఔట్‌డోర్ ఆటల పోటీల్లో బాలురు కోసం ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, కబడ్డీ, డార్జ్‌బాల్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావిలిన్ త్రో, బాలికల కోసం త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, పరుగు పందెం పోటీలు నిర్వహిస్తారన్నారు. నేడు జరిగే పోటీల్లో దాదాపు 1000మంది విద్యార్థులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులకు భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు. సామాజిక దృక్పథంతో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను జనాల్లో ప్రచురిస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రోటరీక్లబ్ సభ్యులు జీవన్‌సింగ్, భరత్‌షా, సునీల్‌రెడ్డి, యూత్ యాక్టివిటీస్ ఇంచార్జ్ సాబీర్ అహ్మద్, హుస్సేన్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగులో సలహాలు పాటించాలి ; ఏఓ

**హాలహర్వి, సెప్టెంబర్14, ప్రభాతవార్త;** పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏఓ శివశంకర్ అన్నారు. శనివారం మండలకేంద్రమైన హాలహర్వి, మెదేహాల్, చింతకుంట తదితర గ్రామల్లో ఆయన పర్యటించారు. పత్తి, కొర్ర, కంది తదితర పంటలను ఆయన పరిశీలించారు. పంటల సాగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగుకు ముందు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు పంటల సాగుకు ముందు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంతేగాకుండా ప్రతియేటా పంట మార్పిడి చేస్తే పంటలకు ఎలాంటి చీడపీడల వ్యాప్తి చెందవన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. ఆయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఇంద్రజ, సూరన్న తదితరులు పాల్గొన్నారు.

# సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖలోకి విలీనం చేయడం పట్ల హర్షం....

**– సీఎం చంద్రబాబు, ఎక్సైజ్‌శాఖ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన ఎక్సైజ్ అధికారులు**



**ఆదోనిటౌన్, సెప్టెంబర్14, ప్రభాతవార్త;** స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను రద్దు చేసి ఎక్సైజ్‌లోకి విలీనం చేసిన సీఎం చంద్రబాబునాయుడు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొలుల రవీంద్రలకు ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం స్థానిక కార్యాలయంలో సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ విన్నీలత మాట్లాడుతూ గతంలో ఎక్సైజ్‌శాఖను సెబ్‌గా మార్చడం జరిగిందన్నారు. నేడు యదావిధిగా ఎక్సైజ్‌శాఖగా మార్చడం పట్ల చాలా సంతోషంగా ఉందన్నారు. తమ విధులు, బాధ్యతలు, ఉద్యోగ భద్రత తదితర వాటికి ఎక్సైజ్‌శాఖ ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఎక్సైజ్‌శాఖగా మార్చడం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



**ఆదోని అర్బన్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** ఆదోని చుట్టుపక్కల గ్రామాలు, పట్టణం నుండి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేందుకు ఎంతోమంది రోగులు వస్తుంటారని ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం, వసతులు అందించాలని జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ నథాడ్ ఇస్మాయిల్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. వైద్యులు తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. సబ్ కలెక్టర్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌లు ఆసుపత్రిల్లో వైద్యులు రోగులకు చికిత్స అందిస్తున్నారా లేదా అని వారానికి ఒకసారి తనిఖీ చేయాలన్నారు. కొంతమంది వైద్యులు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లండని రోగులకు ఉచిత సలహాలు ఇస్తున్నారని వైద్యులు నిర్లక్ష్యం చేయకుండ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. ఎమ్మెల్యే కూడా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందుతుందా లేదా అని తనిఖీ చేయాలన్నారు. అలాగే ఆసుపత్రిలో రక్త పరీక్షలు రెండు గదులు, రోగులకు మందులు ఇచ్చే గదులు రెండు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్ఫాన్ భాష, సబీర్ భాష, సమర్‌భాష తదితరులున్నారు

# ఏఐవైఎఫ్ వర్క్‌షాపును జయప్రదం చేయండి




**మంత్రాలయం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** ఈనెల 20,21,22 తారీఖుల్లో విజయవాడలో జరిగే ఏఐవైఎఫ్ వర్క్‌షాపుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు అన్నారు. శనివారం మంత్రాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులకు, నిరుద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైనట్లు ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలిసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీమేరకు తప్పకుండా ఉద్యోగాలు కల్పించాలన్నారు. యువకుల్లో చైతన్యం కలిగించడానికి ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలుకా ఉపాధ్యక్షులు జీవన్, రాజు, అరుణ, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళను హింసించిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలి-ఏపి ఎమ్మార్పీఎస్



**వెల్దుర్తి, సెప్టెంబర్14, ప్రభాతవార్త**

కర్నూలు జిల్లాలోని పెద్దకడుమూరు మండలం కల్లుకుంట గ్రామంలో గ్రామానికి చెందిన ఆధిపత్య కులస్తులు దళిత మహిళను హింసించి గాయపరచిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఏపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వెల్దుర్తి పట్టణంలో శనివారం ఆయన మండల నాయకులతో కలిసి మాట్లాడుతూ కులాంతర విహాహం చేసుకున్నా డనే విషయంలో పెళ్లి కుమారుడు తల్లిని చెట్టుకు కట్టేసి హింసించి గాయపరచి వికలాంగుడితో తాళి కట్టించేలా చర్యలకు పాల్పడిన సంఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే దాకా ఈ పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లానాయకులు టైలర్‌రాముడు, మండల నాయకులు యల్లక్రిష్ణ, చిన్నఅయ్యన్న, పుల్లయ్య, పెద్దరంగడు తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి ఆచూకీ తెలపండి



**హొళగుంద, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన బుడుదప్ప తమ్ముడు మల్లేష్ అనే 24ఏళ్ల యువకుడు గత నెల 31వ తేదీన మద్యాహ్నం 3గంటల సమయంలో ఇంటి నుండి ఎవరికి చెప్పకుండ వెళ్లిపోవడం జరిగిందని అన్న బుడదప్ప శనివారం హొళగుంద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. తన తమ్ముడికి మతిస్థిమితం సరిగాలేదని గతంలో కూడా ఇలాగే ఇంటి నుండి వెళ్లిపోయి ఐదురోజుల తర్వాత తిరిగి వచ్చాడని అయితే ప్రస్తుతం 15రోజులైనా ఇంటికి రాలేదని కావున ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8309847210, 9703940152కు తెలియజేయాలని కోరారు. ఇంటి నుండి వెళ్లేటప్పుడు బ్లాక్ ప్యాంటు, రెడ్ టీషర్టు వేసుకున్నాడన్నారు. ఇంటి నుండి ఎవరైనా తీసుకెళ్లారా..లేక ఇతనే సొంతంగా వెళ్లాడా..అనేది అర్థం కావడం లేదన్నారు. గత 15రోజులుగా ప్రతి గ్రామంలో వెతుకుతున్నా ఆచూకీ తెలియలేదని దీంతో పోలీసులను సంప్రదించినట్లు తెలిపారు.

# ఉపాధిహామీ పథకం గ్రామసభ



**బనగానపల్లెరూరల్, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** బనగానపల్లె మండల పరిధిలోని మిట్టపల్లె గ్రామంలోని సర్పంచ్ కార్యాలయం నందు మిట్టపల్లె, కాపులపల్లె గ్రామాలకు సంబంధించిన 2023-2024 సంవత్సరానికి ఉపాధి హామీ పథకం గ్రామసభ ఏపీవో హరికృష్ణ, గ్రామాల సర్పంచ్ ఎడమకంటి తులసిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ మనోహర్‌రెడ్డిలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సీవోలు పెద్ద ఓబమ్మ, శివరామిరెడ్డి, డీఆర్‌పి నరేంద్ర ప్రసాద్, ఉపసర్పంచ్ హైమావతి, గ్రామ ప్రజలు యెన్నం సుబ్బారెడ్డి, కుందం వెంకట సుబ్బారెడ్డి, గుండం హరికృష్ణారెడ్డి, కుళాయిరెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

**Form No.3**
**(See Regulation -15 (1)(a)] /16(3) SUMMONS UNDER SUB-SECTION (4) OF SECTION 19 OF THE ACT, R/W SUB-RULE (2A) OF RULE 5 OF THE DRT (PROCEDURE) RULES,1993**
**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL - II,1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDER-ABAD -500001**
**O.A. No. 896 / 2023**
**Between:**
**Union Bank of India (Erstwhile Andhra Bank)**, Kurnool Main Branch
**...Applicant**
**And**
**M/s. Y.R. Mining Company,** Rep by its Partner Y. Ramanna and others
**...Defendants**
To,
1. Mr. S.V. Prasad Reddy, S/o S.V. Subba Reddy, Aged about 63 years, Occ: Business, R/o H.No. 5-1-12, Paturuveedi, Allagadda, Kurnool District -518543
**...Defendant No. 5**
Whereas **O.A. No. 896 of 2023** was listed before Hon'ble Registrar on **05-09-2024.**
Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for Recovery of debts of Rs. 3,93,48,089.90ps (application along with copies of documents etc., annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) To disclose particulars of properties or asset otherthen properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other asse ts and properties in the ordinary course of business and deposits such sale proceeds in the account maintained with the bank or financial institution holding security over such assets.
You are also directed to file the written statement with a copy therof furnished to the applicant and appear before Registrar on 14-10-2024 at 10.30 A.M. failing which the application shall be heard decided in yout absence.
Given under may hand and seal of the tribunal on this date of... September 2024.
**Sd/- Signature of the Authorised Officer to issue Summons**

# ఉమ్మడి జిల్లాల టెలికామ్ అడ్వైజర్ మెంబరుగా మోమిన్ గౌస్‌లాజం

: శ్రీశైలం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి అభినందనలు
: నంద్యాల పార్లమెంట్ ఎంపి శబరి ఆశీస్సులతో మరో అడుగు ముందుకు
: టిడిపి పార్టీ కార్యాలయంలో ఘనంగా పూలమాలలతో సత్కారం 1994 నుంచి రాజకీయ అడుగులు
: మైనార్టీలలో మోమిన్ కుటుంబానికి రాజకీయంగా కేంద్రం పరిధిలో ప్రత్యేక గౌరవం



**ఆత్మకూరు, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** నంద్యాల పార్లమెంట్ ఎంపి బైరెడ్డి శబరి ఆశీస్సులతో రాజకీయంగా మరో అడుగు ముందుకు వేశారని చెప్పవచ్చు. 1994 నుంచి రాజకీయంలో అడుగు పెట్టి నేడు కేంద్రం పరిధిలో ప్రత్యేక గౌరవంను దక్కించుకునే విదంగా శ్రీశైలం నియోజకవర్గంలోనే ఆత్మకూరు పట్టణంలో 5వ వార్డు కౌన్సిలర్‌గా ప్రస్తుతం రాజకీయంను కొనసాగిస్తున్న నేపధ్యంలో మరో అవకాశం వరించింది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల టెలికామ్ అడ్వైజర్ కమిటి మెంబరుగా ఎంపిక కావడంపై శనివారం శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డిని గౌరవంగా పూలపుష్పంతో కలిసి అభినందనలు తెలియజేశారు. నాపై నమ్మకం ఉంచి నన్ను కేంద్ర స్థాయిలో గుర్తించిన నంద్యాల జిల్లా ఎంపి బైరెడ్డి శబరికి మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టెలికామ్ అడ్వైజర్ కమిటి మెంబరుగా ఎంపిక కావడంపై తెలుగుదేశంపార్టీ సీనియర్ మైనార్టీ నాయకుడు నాగూర్‌ఖాన్ ఆధ్వర్యంలో మోటర్ షఫివుల్లా, 2వ వార్డు కౌన్సిలర్ యూనుస్, మాజీ వార్డు కౌన్సిలర్, తెలుగుదేశం సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున్న పూలమాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మోమిన్ గౌస్ లాజం మాట్లాడుతూ రాజకీయంగా నన్ను అన్ని విదాలుగా ఆదరించి దగ్గరకు చేరదీసిన ముఖ్య రాజకీయ నేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. నేడు ఆత్మకూరు పట్టణంలో వార్డు కౌన్సిలర్‌గా ఉంటూ శ్రీశైలం నియోజక వర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో రాజకీయంగా ముందుకు వెల్లడం హర్షించదగ విషయమని అన్నారు. మోమిన్ కుటుంబంలో కేంద్ర స్థాయిలో టెలికామ్ అడ్వైజర్ కమిటి మెంబరుగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఒక్కసారి ఎంపిటిసిగా మరోసారి నా సోదరుడు ఇండిపెండెంట్ వార్డు కౌన్సిలర్‌గా గెలిపించుకో వడం జరిగిందన్నారు. టెలికామ్ అడ్వైజర్ కమిటి మెంబరుగా ఎంపిక చేయడం పట్ల జిల్లాలోని మంత్రులకు, రాజకీయ నాయకులకు కేంద్ర మంత్రులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# శ్రీమఠంలో ఘనంగా శుద్ధ ఏకాదశి వేడుకలు



**మంత్రాలయం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భాద్రపద శుద్ధఏకాదశి వేడుకలు శనివారంఘనంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా శ్రీ రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, నిర్మల విసర్జనసేవ, రాయర పాదపూజ, అష్టోదకం, కనకాభిషేకం, పల్లకిసేవ, మూలరాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకళ్యాణం కొరకు పీఠాధిపతి సుదర్శనహోమం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏపినుండే కాక భక్తులు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రానుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు. అ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు పీఠాధిపతి తప్తముద్రధారణ చేశారు. తరలివచ్చిన భక్తులను ఫల, పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు. మేనేజర్‌లు ఎస్‌కె శ్రీనివాస రావు, వెంకటేష్‌జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచారి, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసి oహమూర్తి, పిఆర్ఓ వ్యాసరాజాచారి. ద్వారపాలక అన oతస్వామి తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి టిజీ భరత్



**కర్నూలు హాస్పిటల్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** గణేష్ నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా వినాయక ఘాట్ వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి టీజీ భరత్ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు డా.బి నవ్య, జిల్లా ఎస్పీ బిందుమాదవ్, ఇంచార్జీ మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, డిటిసి, ఆర్ అండ్ బి అధికారులు, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ ఉమాపతి, మత్స్య శాఖ అధికారి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత మహిళపై దాడి కేసులో.. నింధితులు అరెస్టు

**పెద్దకడుబూరు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త** మండల పరిధిలో కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మపై అదే గ్రామానికి చెందిన చాకలి కులస్తులు విద్యుత్ స్థంబానికి కట్టేసి కొట్టిన దాడి కేసులో నింధితులను శనివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి విలేకర్లకు తెలిపారు. ఈ దాడి ఘటనలో ఏ1 చాకలి భూలక్ష్మి, ఏ2 చాకలి నరసమ్మ, ఏ4 చాకలి లక్ష్మి, ఏ5 చాకలి పెద్దరంగమ్మ, ఏ6 చాకలి నాగరాజు, ఏ7 చాకలి ఉసేని, ఏ8 చాకలి రాముడు, ఏ9 చాకలి భీమరాజు అలియాస్ భీముడు, ఏ10 చాకలి గుండమ్మలను హనుమాపురం బస్టాండ్ వద్ద అరెస్టు చేయడం జరిగిందన్నారు. అరెస్టు చేసిన వారిని ఆదోని రెండవ అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ వద్దకు రిమాండ్ కొరకు పంపినట్లు తెలిపారు. నింధితులకు ఈ నెల 27వ తేదీ వరకు జుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.



## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న రాజస్థాన్ మంత్రి



**శ్రీశైలంప్రాజెక్టు, సెప్టెంబర్14, ప్రభాతవార్త** అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంను శనివారంనాడు రాజస్థాన్ ప్రజా ఆరోగ్యశాఖ మంత్రి కన్హాయ్య లాల్ చౌదరి శ్రీశైల మల్లన్న దర్శనార్ధమై కుటుంబ సమేతంగా శ్రీశైలంలో విఐపి భ్రమరాంబా అతిధి గృహం వద్దకు చేరుకున్నారు. వారికి దేవస్థానం ప్రజాసంబంధాల ఆధికారి టి.శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసారు. తదుపరి ఆలయం వద్దకు చేరుకున్న వారికి ముందుగా ఆలయ రాజగోపురం వద్ద అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవారి ఉభయ దేవాలయాలను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వారికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ప్రాకార మండపంలో అర్చకస్వాములు, వేదపండితులు ఘనంగా సత్కరించి లడ్డు ప్రసాదాలను అందజేసారు.

## నకిలీ వాటర్ బాటిల్స్‌పై విచారణ చేపట్టినఫుడ్ ఇన్స్పెక్టరు



**నంద్యాల, సెప్టెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి** నంద్యాల పట్టణంలో నకిలీ వాటర్ బాటిల్స్ అమ్మకాలపై జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టరు వెంకటరాముడు విచారణ చేపట్టారు. నంద్యాలలో జోరుగా నకిలీ బిసలరీ వాటర్ బాటిల్స్ శోద్యము చూస్తున్న అదికారులు యఅనే శీర్శిక శనివారము వార్తలో ప్రదానంగా ప్రచురించారు. దీనితో స్పందించిన జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టరు వెంకటరాముడు నంద్యాలలోని పలుషాపులో వాటర్ బాటిల్స్‌ను చెక్ చేశారు. ముఖ్యంగా నూనెపల్లె రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఉన్న కూల్‌డ్రిక్కు షాపులో తనికీలు చేపట్టారు. అయితే వార్త ప్రచురితము కావడముతో వ్యాపారులు ముందు కున్నారు. దీనితో తనికీ వెళ్లిన అదికారులు వెనక్కు రావల్సిన పరిస్తితిదాపురించింది. ఈసందర్భమగూ ఫుడ్ అదికారి మాట్లాడుతూ తిరిగి మరోమారు తనికీలు చేపడతామని అవికనిపిస్తే వెంటనే సీజ్ చేసి బాద్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అళ్లగడ్డలో కలెక్టరు ఎంఎల్ఏ భూమా అఖిలప్రియ సుడిగాలి పర్యటన



**నంద్యాల, సెప్టెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి** అళ్లగడ్డ పట్టణంలోని అభ్యుదయ కాలనీలో అతిసారా వ్యాది సోకి జనము మంచాన పట్టారని తెలియడముతో నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి, యంయల్ఏ భూమా అఖిలప్రియలు ఏరియా సుడిగాలి పర్యట చేశారు. బాదితుల ఇంటింటికి తిరుగు వారి క్షేమాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గత నాల్గు రోజుల నుండి అళ్లగడ్డలో అతిసారా వ్యాది సోకి ముగ్గురు వ్యక్తులు మరణించారనే తెలియడము కలెక్టరు అ ఏరియాతో పాటు అసుప త్రిని సందర్శించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ అళ్లగడ్డ పట్టణంలో కేవలము 11 కేసులు మాత్రమే యాక్టివ్లఓ ఉన్నాయని మిగతా వారంతా డిచార్జి అయ్యారని చెప్పారు. చనిపోయిన ముగ్గురిలో కూడా వుశేనిబాషా, 75 సంవత్సరాలు గుండె నొపి ్తతో చనిపోవడము జరిగిందన్నారు. చంద్రమోహన్ 45 సంవత్సరాలు నిమజ్జనము రోజు అల్కహాలు తీసుకుని లైట్గా మోషన్ రావడముతో అందులోనూ టీవీ పేషంట్లు కావడముతో గవర్నమెంటు హస్పటల్‌లో చేరాలని చెప్పిన కూడా వినలేదని బార్య చెప్పిందన్నారు. ఇమాంబి 70 ఈమె కిడ్ని పేషంటు ఘగర్ బిపిఅన్ని ఉన్నాయని చెప్పారు. ప్రెంటు ఇప్పుడు 11కేసులో కూడా 90ఏళ్లకు పైబడిన వృద్దురాలు ఉన్నారని అమెకు ఏమైన గాని అయితే అతిసారా వ్యాదితో చనిపోయిందంటారా అంటు ప్రశ్నించారు.

## 16న వినతుల స్వీకరణ రద్దు



**కర్నూలు మున్సిపల్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్తః** నగర పాలక కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 16వ తేదిన మిలాద్ ఉన్ నబీ పండుగ సెలవు కారణంగా కార్య క్రమాన్ని రద్దుచేస్తున్నట్లు కమిషనర్ పివి రామలింగేశ్వర్ తెలిపారు. సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం ఉండదనే విషయాన్ని ప్రజలు గమనించా లని కమిషనర్ కోరారు.

## యంపి బైరెడ్డి శబరితో ఇరిగెల సోదరులు బేటీ



**నంద్యాల, సెప్టెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి** నంద్యాల యంపి బైరెడ్డి శబరితో అళ్లగడ్డ సీనియర్ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి తన సోదరులతో కలిసి బేటీ అయ్యారు. శనివారం నంద్యాల పట్టణంలోని యంపి కార్యాలయంలో ఇరిగెల సోదరులు అమెను మర్యాద పూర్వకముగా కలిశారు. అళ్లగడ్డ ప్రస్తుత రాజకీయాలు ఉమ్మడి ప్రభుత్వం చేయాలి ఒసన అబి వృద్ది సంక్షేమ పథకాలు పనులు త్వరలో జరుగనున్న నామినేటెడ్ పోస్టుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్రలు అళ్లగడ్డ నియోజక వర్గంలో యంపి ల్యాండ్స్ మంజూరు తదితర వాటిపై యంపి బైరెడ్డి శబరితో ఇరిగెల సోదరులు చర్చించారు. ఈ సమావేశంలో చాగలమర్రి జనసేననాయకులు జున్నుప్రసాదరెడ్డి ఇరిగెల జయేంద్రారెడ్డి ఇరిగెల సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.

## పోరాట స్ఫూర్తికి ప్రతిరూపం ఏపీటీఎఫ్

- ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు విద్య, సెప్టెంబర్ 14, ప్రభాతవార్తః** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మరియు విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించడం శుభపరిణామమని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్పొరేషన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా విద్యా మహాసభ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ 80 సంవత్సరాలు పూర్తిచేసుకోవడం, ఈపరంపరలో బాధ్యతలు చేపట్టిన నాయకత్వంను పరిశీలిస్తే ఏపీటీఎఫ్ పోరాట స్ఫూర్తి గల సంఘంగా, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాట సంస్థగా అభివర్ణించారు. ఏపీటిఎఫ్ ఇటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కొరకు, సమాజ శ్రేయస్సుకొరకు పాటుపడడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు ఈప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని విద్య, వైద్యం అభివృద్ధి కోసం పనిచేస్తామన్నారు. 80 సంవత్సరాల ఏపీటీఎఫ్ మహాసభల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులతో ప్రభుత్వం స్నేహంతో ఉంటామన్నారు. ఏపీటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి హృదయరాజు పాల్గొని మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఘన చరిత్రను తెలుపుతూ నాయకత్వ పోరాటాలతో నేడు ఉపాధ్యాయులు పొందుచున్న అన్ని సౌకర్యాలు ఏపీటీఎఫ్ ద్వారా వచ్చాయని తెలిపారు. ప్రస్తుత విద్యారంగ సమస్యలు ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసే పరిస్థితులు లేవని బోధనకు ఆటంకంగా అన్ని అనవసర కృత్యాలను తొలగించాలన్నారు. ఐఫియా జాతీయ చీఫ్ పాట్రాన్ కె సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో హింసాత్మక ప్రవృత్తి విపరీత దోరణులు-పరిష్కారాలు అనే అంశంపై చర్చించారు. సమాజం, పతన సంస్కృతి, సోషల్ మీడియా, తల్లిదండ్రులు తమ కార్యకలాపాల్లో బిజిగా మారడం, రాజరిక వ్యవస్థ సామ్రాజ్య భూస్వామ్య లక్షణాలు కొనసాగడం, టీచర్లకు గౌరవం ఇవ్వకపోవడం లాంటి విపరీత దోరణులు ఉన్నాయన్నారు. కుటుంబ వ్యవస్థ నుండి పాలక ప్రభుత్వాల వరకు అందరు మారాలన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె భాస్కర్, ఏపీటిఎఫ్ రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి కె కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మధుసూధన్‌రావు, మహమ్మద్ రఫీ, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి మరియానందం, ఏపీ పిఈటి పిడి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మయ్య, చందునాయక్, ఎంఈఓ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, ఆర్‌యూ పిపి జిల్లా అధ్యక్షులు నాగేంద్ర, ఎన్‌టిఏ అధ్యక్షులు కృష్ణ, నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు, నాయకులు టివి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పగిడ్యాల సర్పంచ్ గొల్ల గోవిందు మృతికి ఎంఎల్ఏ జయసూర్య సంతాపం

**పగిడ్యాల, సెప్టెంబరు 14, ప్రభాతవార్త** పగిడ్యాల మాజీ సర్పంచ్ గొల్ల గోవిందు (72) శనివారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలియడంతో ఎంఎల్ఏ జయసూర్య గొల్ల గోవిందుభౌతికకాయాన్ని సందర్శించి పూలమాలువేసి నివాళ్ళుఅర్పించారు. గోవిందుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోవిందు కుటుంబసభ్యులను పరామర్శించి గోవిందు మృతికి సంతాపంతోపాటు ఎంఎల్ఏ జయసూర్య ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢసానుభూమతి తెలిపారు. పగిడ్యాల గ్రామసర్పంచ్‌గా ఎంపిటీసిగా గోవిందు పనిచేశారనీ గ్రామ అభివృద్ధి కోసం పాటు పడ్డాడనీ పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతి టిడిపి పార్టీకి తీరనిలోటనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడిపి నాయకులు బొగ్గుల దామోదరెడ్డి, పుల్యాల వాసురెడ్డి, ఒగిలి శ్రీనివాసులు బందు మిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందిస్తాం - బీసీ ఇందిరారెడ్డి

- టీసీ ఇందిరారెడ్డికి ఘనస్వాగతం పలికిన టంగుటూరి శీనయ్య



**బనగానపల్లెరూరల్, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు తమ వంతు తోడ్పాటు అందజేస్తామని రా ష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి, రాష్ట్ర థాయ్‌బాక్సింగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి బీసీ ఇందిరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా బీసీ ఇందిరారెడ్డి అక్కడికి చేరుకోగానే ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు, టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్యతోపాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు పుష్పగుచ్ఛం అందజేసి ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీసీ ఇందిరారెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బీసీ ఇందిరారెడ్డి ఆకాంక్షించారు. అలాగే ఆర్యవైశ్యులు కేవలం వ్యాపార రంగంలోనే కాకుండా రాజకీయ పరంగా కూడా ఎదగాలన్నారు. రానున్న రోజుల్లో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో ఆర్యవైశ్యుల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని బీసీ ఇందిరారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె అర్బన్ సీఐ కృష్ణయ్య యాదవ్, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు గోపాల్‌శెట్టి, వంకదార ప్రసాద్, కాసుల జంగంశెట్టి, సుబ్రహ్మణ్యం, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మల్లారెడ్డి, సీనియర్ న్యాయవాది నాగేంద్రారెడ్డి, కోడి నాగేష్‌బాబు, యనకండ్ల ఖాదర్, బత్తుల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్ లో 230 కేసులు పరిష్కారం



**నందికొట్కూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** జాతీయ లోక్‌అదాలత్‌లో 230 కేసులు పరిష్కారం అయినట్లుగా సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్ జడ్జీ దివ్య తెలిపారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో ఐపిసి 24, ఎన్.ఐ.యాక్ట్ 2, ఓఎస్‌మని 6, టైటిల్ సుఇట్స్ 2, ఇపి 1, యం.సి. 1, ఎస్‌టిసి అడ్మిషన్ 180. ఐపిసి అడ్మిషన్ 13, పిఎల్‌సి 1, పరిష్కారం అయ్యాయని, పై కేసులలో రూ.2,18,480లు పరిష్కారం అయినట్లుగా వారు తెలిపారు.

## 16న నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

**ఆదోని, సెప్టెంబరు 14, ప్రభాతవార్త** ఈ నెల 16న సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌భాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 16న మిలాదున్ నబీ(ప్రభుత్వ సెలవుదినం) పండుగ కావడంతో జిల్లా కేంద్రం, డివిజన్ స్థాయి, మున్సిపాలిటీ పరిధి, మండల స్థాయిలో ప్రజాఫిర్యాదుల వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

## టెన్షన్‌గా బ్రతకడం కంటే రాజీ అయి ప్రశాంత జీవితము గడుపండి-జడ్జి

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 14, ప్రభాతవార్త** మనిషి జీవితములో నిత్యము వత్తిడి టెన్షన్‌తో జీవించడము కంటే రాజీ అయి ప్రశాంత జీవితము కడుపుతో అరుబయట మంచము వేసుకుని స్వేచ్ఛగా నిద్రించవచ్చుని జూనియర్ సివిల జడ్జి అబ్దుల్ రహామాన్ అన్నారు. హైకోర్టు అదేశాల మేరకు శనివారుము మెగా లోక్‌అదాలత్ జడ్జి అబ్దుల రహామాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భముగా అయన కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ మనిషి జీవితము నిత్యము టెన్షన్‌తో కొనసాగరాదు. అలాగే ఘర్షణలు వివిదాలు పడుత జీవిస్తే స్వేచ్ఛగా జీవించలేదని చెప్పారు. అదే ఎదుటివాడితో ఎలాంటి వివిదాలు పెట్టుకోకుండా, ఘర్షణలకు అమడదూరములో ఉండి అందరు కలిసి మెలసి ఉంటే అరుఏబయట



మంచము వేసుకుని ప్రశాంతముగా నిద్రించ వచ్చుఅన్నారు. అలాంటి జీవితాలకు ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలని చెప్పారు. రాజీ మార్గమే నేటి సమానజములో రాజమార్గం అందుకే అందరు కలిసి మెలసి జీవించాలని అయన పిలుపు నిచ్చారు. ఈ అదాలత్‌లో 33 కేసులను పరిస్కరించి రూ 250000 వసూలు చేశారు. అందులో బాగంగా ఐపిసి సిసి 27కేసులు, యంపిఒకటి యన్‌టియాక్టు 1, యూపి 1కేసుకుగాను(67000) వసూలు, ఓసి 3 కేసులకు గాను( 1500230) వసూలుయస్‌టిఇ 91కేసులు, అమౌంటు 6000, సిసి 1 కేసును మొత్తం 33 కేసులకుపరిస్కారము చూపించారు.